ఎండమావుల్లో తిమింగిలాల వేట

కె. సభా



ముక్కంటి సీమలో పెద్ద కాటకం వచ్చింది. క్షామ దేవత విలయతాండవంలో జన పదాలన్నీ అల్లాల్లాడి పోయినవి. దప్పిక చల్లార్చుకోవడానికి చుక్కనీరు కూడా లభించని అసహాయ స్థితిలో కొంపాగోడూ వదలి ఆ దేశం ఎల్లలు దాటిపోతున్న కూలీల గోడు అవర్ణనీయమై పోయింది.

రోజూ పత్రికల్లో ఈ వార్తలే అచ్చు కావడం వల్లా మంత్రి వర్గం అత్యవసర సమావేశంలో కొన్ని ముఖ్య నిర్ణయాలను తీసుకొన్నది. మండలానికొక మంత్రి వెళ్ళి అప్పటికప్పుడే కరువు నివారణ కార్యక్రమాలను ప్రారంభించాలని ఎన్ని కోట్లనైనా వెచ్చించి ప్రజలను కాపాడి తీరాలని అమాత్యులందరూ కంకణం కట్టుకొన్నారు.

మత్స్యశాఖామాత్యులు రాజాసుందరప్రకాశ గోవర్ధన శతపథిగారు కనకాచలం జిల్లా పర్యటనకు బయలుదేరారు. మంత్రిగారి పర్యటన కార్యక్రమాన్నంతా స్థానిక పత్రికలు ప్రముఖంగానే ప్రచురించాలనుకొన్నందున ఆ జిల్లా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ అవసరమైన ముందు జాగ్రత్తలన్నీ తీసుకొన్నాడు. దినవార పత్రికల విలేఖరులనే కాక మాసపత్రికల విలేఖరులను కూడా పిలిపించి కనకాచలంలో ప్రెస్సు కాన్ఫరెన్సును యేర్పాటు చేశాడు.

ఆ రోజు కనకాచలం ట్రావెలర్సు బంగళాలో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో మత్స్యశాఖామాత్యులు రాజా సుందరప్రకాశ గోవర్ధన శతపథిగారనేక కొత్త విషయాలను వెల్లడించారు.

డైనమైట్ పత్రిక విలేఖరి అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ మత్స్యశాఖామాత్యులు యిలా అన్నారు.

'మనం సామ్యవాద యుగంలో ఉన్నాము. రుచిలో బేడిసెలే బాగుంటాయనీ బుడ్డపక్కెలు బాగుండవనీ భేదాలెంచుకోరాదు. మనకు కొరదైనా ఒకటే కొరమేనైనా ఒకటే. పూజేపను పెంచుతూ మావురాయిని మరచిపోరాదు. మన నేతల వలె పీతలను కూడా సంరక్షించుకోవాలి. జపానులో నేను గమనించాను. వాళ్ళు సీఫుడ్‌ను బాగా ఉపయోగించుకొంటారు. ఈ కరువులో ప్రతి చెరువులో జెల్లలనో ఇసుక దొందులనో పెంచుకోకుంటే దేశం దెబ్బతింటుంది.'

'మన చెరువుల్లో నీళ్ళుంటే గదా సార్?' మధ్యలో ప్రశ్నించాడు సౌదామిని విలేఖరి.

'డోన్ట్ డిస్టర్బ్ మి, దటీజ్ అనదర్ ప్రాబ్లం' అంటూ అమాత్యులు సిగరెట్ ముట్టించి—

'యుసీ ... ఈ నత్తలున్నాయే వీటిని పుష్కలంగా పెంచాలి. వాటిలో క్రొవ్వు పదార్థం యెక్కువ. ప్రతి గుంటలోనూ పెంచే వీలుంది. అన్నట్టు మరచాను. నేను ఇండోచైనా వెళ్ళినపుడు అక్కడొక మ్యూజియంలో నా యెత్తు తాబేళ్ళను చూశాను. కాదూ కూడదంటే కొంత మసాలా ఎక్కువవుతుంది. కాని అది బలేరుచిగా కూడా ఉంటుందని నా నాన్‌వెజిటేరియన్ ఫ్రెండొకాయన చెప్పాడు. అతడిపుడు చికాగోలో ఉన్నాడనుకోండి. ఇక్కడ చెరువు లెక్కేగా?' ప్రశ్నించాడు గౌరవనీయులైన మత్స్యశాఖామాత్యులు.

అందరూ కాకున్నా ఇంచుమించు సగం మంది ఎక్కువనే చెప్పారు. కాని జాజిమల్లె పత్రిక కరస్పాండెంటు మాత్రం 'అర్ధం చెరువులకు పైగా కట్టలు తెగిపోయినవే' అన్నాడు.

'డజన్ట్ మేటర్. ఆ పని మనది కాదనుకోండి. ఇరిగేషన్ మినిస్టర్ చూస్తారు. మన చెరువుల్లోనే కాదు. ప్రతి బావిలోనూ చేపల్ని పెంచాలి. కరువులో చేపల్ని పెంచే కార్యక్రమం క్రింద కనీసం పదికోట్లరూపాయలనైనా ప్రత్యేకించమని నేను సి.యం. తో గట్టిగా చెప్పాను. కానీ మా ఫైనాన్స్ మినిస్టర్ ఒప్పుకొంటేగా. చివరికి యాభై లక్ష లిచ్చాడు. కడకు నేను మొండిగా పేచీ పెడితే రెండుకోట్లు చేపలుపట్టే వలల్ని కొనడానికి అలాట్ చేశారు.'

'పెంచకనే పట్టే ప్రశ్న ఎక్కడుంటుందండీ?' చిన్నగా నసిగాడు సిగ్నల్ పత్రిక విలేఖరి.

'మీ కదే అర్థంకాదు. ఒక్కసారిగా వలల్నికొంటే పెంచే చేపల్నంతా పడుతూ ఉండవచ్చు. జాలర్లు వీకర్ సెక్షన్‌కు చెందిన వాళ్ళు. అసలు మైనారిటీ కమ్యూనిటీస్‌ను డెవలప్ చెయ్యడమే మన ధ్యేయం. సోషలిజం ముఖ్యసూత్రం ఒకటుంది. చిన్న చేపల్ని పెద్ద చేపలు మ్రింగివేసినట్లు మెజారిటీ కమ్యూనిటీస్ మైనారిటీ కమ్యూనిటీస్‌ను మ్రింగివేయడాన్ని చూస్తూ ఊరుకోరాదు. అందుకే మా డిపార్టుమెంటుకు ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్సులో 'పెద్ద చేపలు చిన్న చేపల్ని మ్రింగివెయ్యకుండా చూడాలి' అన్నాము. ఒకేసైజు చేపల్ని పెంచమన్నాము. బొంబడాయిలుండే బావిలో మావురాయిల్ని వదలేస్తే ఏమవుతాయి చెప్పండి? తాటాకు చేపల్ని పాము చేపల్ని పక్కల్లో విడిస్తే బతకవు!...అంటూ టైం చూచుకొని 'వేరిస్ అవర్ ఇన్‌స్పెక్టర్' అన్నారు అమాత్యులు.

ఏడుకొండలవాడికంటే వెడల్పైన నామాలు పెట్టుకొన్న బంట్రోతు వచ్చి 'వారు పరిగిలి గుట్టలో తమ రాకకు యేర్పాట్లు చెయ్యడానికి వెళ్ళారు దేవరా' అన్నాడు.

పరిగిలగుట్ట అక్కడికి పాతికమైళ్ళుంది. కార్యక్రమం ప్రకారం చెన్నారాయుడి చెరువులో చేపల పెంపకం కేంద్రానికి మంత్రి ప్రారంభోత్సవం చేస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఉత్సవానికి కనకాచలం జిల్లాపరిషత్ అధ్యక్షులు మచ్చా జీవానందంగారు అధ్యక్షత వహిస్తారు. అదే సభలోనే బెస్తలకు క్రొత్తవలలు పంచబడుతాయి.

జిల్లా కలెక్టర్ కారు ముందు దారి తీసింది. వెనుక మత్స్యశాఖామాత్యుల కారు ఆ వెనుక పబ్లిక్ రిలేషన్సు డిపార్టుమెంటువారి వ్యాను నిండుకూ పత్రికా విలేఖరులు, పరిగిలిగుట్ట సమితి అధ్యక్షుల జీపు ఇంకా యేవో కొన్ని వాహనాలు తుర్రుమంటూ దూసుకపోయాయి.

పరిగిలి గుట్టలో పెద్ద పందిరి వేశారు. భగభగమండే ఎండను లెక్కచెయ్యకుండా ఆ పరిసరాలనుండి పంచాయతీ సర్పంచులు, మునసబులు, కరణాలు, కాంట్రాక్టర్లు, సమితి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వందల సంఖ్యలో సమావేశమయ్యారు బాగా అలంకరించిన బండిపై పెద్ద గాజుతొట్లలో రకరకాల చేపలు విలాసంగా విహరిస్తున్నాయి. వాటిలో బంగారు వన్నెల మీనులూ కుచ్చుతోకల జలపుష్పాలు కూడా ఉన్నాయి.

మంత్రిగారు పరిగిలిగుట్టకు చేరేలోగా గంట మూడు దాటింది. అక్కడిను [illegible] రాయడి చెరువు అరమైలు. ఆ దారిపొడుగునా పెద్ద ఊరేగింపు. అమాత్యులను లారీపై అమర్చిన పూలపల్లకిలో కూర్చోబెట్టారు. ఆ పల్లకిని కూడా మత్స్యాకారంతో అతి రమణీయంగా పచ్చచామంతి పూలతోనే జోడించారు.

'కరువులో చేపల్ని విరివిగా పెంచండి'

'ఎండుచేపల తిండి గుండె బలాన్నిస్తుంది'

'పూజేపల్ని పెంచితే పుణ్యం వస్తుంది'

'తాబేళ్లను పెంచండి కుబేరులైపోండి'

'ఎండ్రకాయల క్రొవ్వులో ఎంతో బలముంది'

'అన్నిరకాల చేపల్ని పెంచడమే అసలైన సోషలిజం'

'కరువు బరువు తగ్గాలంటే కరవాళ్లను వాడండి'

'పప్పన్నం తినకండి. ఉప్పుచేపలు వాడండి'

ఇంకా రకరకాల నినాదాలు వ్రాయబడిన అట్టలతో కొమ్ములు, తుతార్లు, పిల్లనగ్రోవులు, జాగంటలు, జవనికలు, తుడుములు, పలకలు, డోళ్లు, మేళాలు, నాగస్వరాలు, కిలారినట్లతో భూనభోంతరాళాలు దద్దరిల్లేటట్లు ఊరేగింపు ఆరంభమైంది.

మత్స్యశాఖామాత్యులు శ్రీ రాజాసుందర ప్రకాశగోవర్ధన శతపతిగారు కోరమీసాన్ని మెలివేసుకొంటూ సుఖాశీనులైన దృశ్యం నయనానందకరమైనా ఎండధాటికి తట్టుకోలేక విలేఖరులందరూ ముందుగా చెన్నారాయడి చెరువు వేపు దారి తీశారు.

పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరు వారిని చెరువులో నున్న వేదిక దగ్గరకు తీసుకపోయి తలో కొబ్బరి బోండా ఇప్పించాడు. వారా ఎలనీటిని త్రాగి సిగరెట్లు కాల్చుకొంటూ వేదికకు దక్షిణంగానున్న సిమెంటుతొట్టి దగ్గరకు వచ్చి నిలబడ్డారు. వందఅడుగుల పొడవు, నలభై అడుగుల వెడల్పున్న ఆ తొట్టిలో అర్ధానికి పైగా నీరున్నది. నుసలెచ్చని ఆ నీటిని ఆ ఉదయమే తెచ్చిపోసినట్లు అతి ప్రయత్నం మీద కనుగొన్నారు. ఏడేండ్లక్రితం మొరవ పాగిన చెన్నారాయుడి చెరువులో మూడేళ్ళ నుండి నీటిచుక్క లేదు. [illegible] చెరువు గర్భంలోనే జొన్నలు చల్లినా వాన బొట్టు లేక విత్తనాలు మాడిపోయాయట.

పినా మత్స్యశాఖామాత్యులు ఇటీవలనే అనేకదేశాలలో పర్యటించి వచ్చిన విశేషానుభవాలతో కరువులో చెరువుల్లో చేపల్ని పెంచే విస్తృతమైన పథకాన్ని చేపట్టారు. అతి సాహసోపేతము, పరిశోధనాత్మకమూ అయిన ఈ పథకంతో ముక్కంటి సీమ లెక్కలేనన్ని టన్నుల చేపల్ని ఉత్పత్తి చెయ్యగలదని వారి విశ్వాసం. ఈ దెబ్బతో ఇంటర్నేషనల్ మార్కెట్టు లభించినా ఆశ్చర్యంలేదు. విలేఖరులా నిర్దిష్టమైన భోగట్టాలనంతా సేకరిస్తుంటే అప్పుడే జీపునుండి దిగిన ఫోటోగ్రాఫర్లు ఊరేగింపు దృశ్యాలను కెమెరాలలో సంక్షిప్తంగా దాచుకొంటున్నారు.

ఆకసమే చిల్లులుపడే అట్టహాసాలతో ఊరేగింపు చెన్నారాయడి చెరువులో ప్రవేశించింది.

బ్రహ్మాండమైన పందిరిలో అత్యంత శోభాయమానంగా అలంకరించబడిన వేదికపై అమాత్య శేఖరులు నాయకులు ఆసీనులైన వెనుక స్థానిక నియోజకవర్గం యం. యల్. ఏ. మైక్ ముందు నిలబడ్డారు. రెండున్నర మీటర్లు వ్యాసంకల వారి బొజ్జపై హాయిగా శయనించియుండిన వారి హస్తాలను అతి ప్రయత్నం మీద పైకెత్తి ఒక్క దండం పెట్టి సభాంగణము నుద్దేశించి వారిట్లా అన్నారు.

'నా రైతు సోదరులారా! కూలీ సోదరులారా! హరిజన సోదరులారా! ఈ దినం శుభదినం. ఎన్నో వ్యయప్రయాసలతో నింతో దూరంనుండి ఈ చండ్ర నిప్పులు కురిసే — బండలైనా చిట్లిపోయే యెండల్లో మన మంత్రి మనమధ్యకి వచ్చారంటే ఏమనాలి. ఇది ప్రజారాజ్యం. సోషలిజంలో ఇదే ఉంది. నా సేవ మీకు తెలిసిందే. గుండ్రాళ్ల పల్లె కుంటకట్టుకు మన్ను పోయించాను. పాపాద ఊరిబడిలో రెండో టీచర్ని వేశాను. నక్కావాళ్ల పల్లెలో మంచినీళ్ల బాయి తొవ్వించాను. ఇప్పుడు వేళకాదు. చిన్నో ఉన్నాయి. ముందు మంత్రిగారు మాట్లాడుతారు' అని అంటుండగానే

'సన్మాన పత్రాలు. సన్మాన పత్రాలు... సన్మానపత్రాలు' అంటూ కేకలేశారు జిల్లా పరిషత్ చేర్మన్ మచ్చా జీనానందం గారు.

ఎండమావుల్లో...

కోర్టులో విన్పించే నిశబ్దంవంటి ఆశేకతో సభలోనుండి పది మంది వేదికపైకి దుమికారు. వాటిలో ఒక్కటి మాత్రం చదివితే చాలన్నారు అమాత్యులు.

పరిగిలిగుట్ట హైస్కూల్ సీనియర్ తెలుగు పండిట్ హానరబుల్ పొయెట్ సుగ్రీవాచార్యులుగారు గసపోసుకొంటూ మైక్ దగ్గరికి వచ్చి వణుకుతూ గొంతును సవరించుకొని పఠనానికి ఉపక్రమించారు. ఆయనా పంచాయతీ సమితికి ఆస్థాన కవి. గౌరవనీయులు ముక్కంటి సీమ మత్స్యశాఖామాత్యులు శ్రీ రాజా సుందరప్రకాశ గోవర్ధన శతపథిగారికి పరిగిలిగుట్ట పంచాయతీ సమితి సమర్పించిన సన్మానపత్రము.

అమాత్య సత్తమా!

అత్యంత పరాక్రమోపేతులై, అభిసిర భయంకరులై, అత్యధిక శౌర్య ధైర్య సాహసోపేతులై, అతల వితల సుతల తలాతల రసాతల పాతాళ లోక భయద వికటాట్టహాస వీరవిహారంతో అలనాటి భారత స్వాతంత్ర్య సంగ్రామ రంగమునందు దుమికి; విజయ దుందుభి మ్రోగించి స్వరాజ్యమును సాధించి...'

అనగానే సభాంగణంలో నున్న సౌదామిని కరస్పాండెంటు 'ఆనాడీయన వయస్సు ఐదారేండ్లుంటాయా' అని నసిగాడు కానీ ఎవరికి వినిపించలేదు.

'స్వరాజ్యమును సాధించి నేడు సామ్యవాదమును స్థాపించుటకు కంకణము దాల్చి మత్స్యశాఖామాత్యులుగా మన ముక్కంటి సీమలోని ఒక్కొక్క చెరువులోనూ లెక్కలేనన్ని చేపలను పెంచి దశదిశలకూ పంచి కరువును నివారించి కొత్త చరిత్రను సృష్టించుటకు అవతారమెత్తిన మత్స్యావతారుడైన మీరాక మాడెందముల కానందదాయకమై నోటమాట రాక యున్నది:

మంత్రి శేఖరా!

మా చేదబావులలో చేపలు లేవు, నీరు లేకున్నను బ్రతికే చేపలను శాస్త్రజ్ఞులు పరిశోధించునట్లు ఉత్తరువులు దయచేయ ప్రార్థన.

మంత్రి పుంగవా!

మా వాగులలో అక్కడక్కడ మడుగులున్నవి. వాటిలో వదులుటకు తాబేళ్ళను నత్తలను సరఫరా చేస్తూ వాటిని భక్షించడానికి వచ్చే కొంగలను కాల్చడానికి తుపాకులతోపాటు లైసెన్సులు కూడా ఇచ్చునట్లు కలెక్టర్ కిప్పుడే ఆర్డర్లు అనుగ్రహించమని మా విజ్ఞప్తి!

ప్రజల పాలిట పెన్నిధీ!

మా చెరువులన్నీ ఎండిపోయి ఉన్నందున ప్రతి చెరువులోనూ సిమెంటు తొట్లు కట్టించి వాటినిండుకూ నీటిని పోయించి చిన్న చేపలతోపాటు పెద్ద చేపలను కూడా తెప్పించి కొందరు బ్రతికడానికి వీలుగా సిమెంటు తొట్లలో బోరియలు త్రవ్వించమని అభ్యర్థన.

మేరునగధీరా! సాగరగంభీరా!

మా పెరళ్లలో నీటి తొట్లలోకూడా చేపల్ని పెంచడానికి అనువుగా వారానికొక కిలోవంతున ఉలసల్ని తెల్లల్ని సరఫరా చేసి ఈ కరువులో [illegible] ఈ చేపల నంతా పట్టుకోడానికి ఇంటికొక వలను కూడా మంజూరు చేయాలని ప్రార్థన.

ఇంత శ్రమతో ప్రయాణంతో మా మీద అలకించిన మీకు దేవతలు నిండుగ, అల్లా, ఏసు ఆయురారోగ్య ఐశ్వర్య భోగభాగ్యములను ప్రసాదించుగాక!

ఇట్లు,
పంచాయతీ సమితి అధ్యక్షులు
మరియు సభ్యులు,

పరిగిలిగుట్ట
1—10—1972

చిరునవ్వు లొలికిస్తూ సగౌరవాన్వితంగా తల వాడిస్తున్న మంత్రిగారి పైకి [illegible] వంద పూలదండలు వారి మెడను అలంకరించాయి. పరిగిలిగుట్టంత పూలగుట్టను ప్రక్కకునెట్టి అమాత్యవర్యులు అత్యంత గంభీరస్వరంతో ఇలా అన్నారు.

సోదరులారా! అనగానే కెమెరాలు క్లిక్కు మన్నాయి. కరస్పాండెంట్లందరూ కలాలు తీసుకొన్నారు. ప్రేక్షకుల చెవులు రిక్కపొడుచుకొన్నాయి.

'ముందుగా [illegible] పని' అంటూ మంత్రి ఉన్నట్టుండి వేదిక దిగారు. వారి వెంట నాయకులూ నడిచారు. సిమెంటు తొట్టిలోనికి మంత్రిగారు గాజుతొట్టిలోని చేపల్ని వదిలారు. అప్పటికే మహాప

పాటిగా కాగిన ఆ వేడినీటిలో ప్రవేశించిన చేపపిల్లలు అల్లల్లాడుతుండగా అమాత్యులు వేదికవద్దకు వచ్చి ఉపన్యాసం ప్రారంభించారు.

ఇంగ్లాండు, స్కాట్లాండు ఐర్లాండు, పోలెండు, ఫిన్లాండ్, నార్వే, స్వీడెన్, డెన్మార్క్ మొదలైన దేశాలలో తాను చూచిన చేపల్ని గురించి చెబుతూ ముక్కంటి సీమనంతా మత్స్య పరిశ్రమతో నింపి తన బాధ్యతను నెరవేర్చుకొంటానన్నారు. కరువులో చేపల్ని పెంచాలనీ, కరువు నివారణకి అదొక్కటే తరుణోపాయమనీ సెలవిస్తూ పరిగిరి గుట్టలోని బెస్తలకు వలలను బహూకరించారు. వలలతోపాటు సింగిలాలు, కొడాలు, గాలాలనుకూడా విరివిగా పంచిపెట్టి చేపల్ని విలా పట్టాలోకూడా పట్టి చూపెట్టారు. ఆయాశాఖకు ఆధిపత్యం వహించే అమాత్యుడు యాపనలను స్వయంగా చేసిచూపడం ఆదేశంలో అనుశ్రుతంగా వస్తున్న సాంప్రదాయం.

మంత్రిగారు తొట్టిలోకి వదలిన చేపలన్నీ నీటిపై తేలుతూ ఉన్నందున సింగితంతో దేవిదేవి పైకి తీశారాయన. చేపలట్లా వెల్లకిలా పడిపోవడం ఎందుకని జాజిమల్లె పత్రిక కరస్పాండెంట్ అడుగబోతుండగా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ అతని వెనుకనుండి చొక్కా లాగడు! కరస్పాండెంటు మౌనంగా వ్యాన్‌వైపు నడచిపోయాడు.

మత్స్యశాఖామాత్యులు సరదాగా పట్టిన చేపల్ని ఆ జాలర్లకే యిచ్చి మళ్ళీ వేదికపై ఆశీనులయ్యారు.

పంచాయితీసమితి అధ్యక్షుల కృతజ్ఞతతో సమావేశం ముగిసిపోయింది ఆ సమయానికి సరిగ్గా పొద్దుకూడాపోయింది

పరిగిరిగుట్టలో ఆ రాత్రి డిన్నరున్నట్లు విలేఖరులకు తెలిసింది. వెజిటేరియన్సుకు కూడా మత్స్యాల ఆకారంతో కజ్జికాయలు, రొయ్యల రూపాలతో బూంది, వడ్డించబడుతాయనీ ఆ రాత్రికేదో ఎంటర్‌టెయిన్‌మెంటు ఉంటుందనీ పౌరసంబంధ శాఖాధికారి సెలవివ్వడంతో విలేఖరులందరూ ఆలోచనలో పడ్డారు.

కరువులో విందులేమిటని నసిగాడు సౌదామిని విలేఖరి.

అసలు ఒక్కొక్కడుండవయ్యా మాకు ఆయన ఒండే శంఖ్యం అర్ధరాత్రైనా అంటూ అంగీకరిస్తున్నట్టు తల ఊపాడు జాజిమల్లె కరస్పాండెంటు.

అందరూ పంచాయతీ సమితి అధ్యక్షుల వారి కొత్త భవనంలో ప్రవేశించేలోగా హాలంతా విస్తళ్లు కన్పించాయి.

ఆ విందును, వివిధరకాల పిండివంటలతో పంచభక్ష్య పరమాన్నాలతో వడ్డించిన ఆ విందును అరగించి తాంబూలాలను సేవిస్తూ అక్కడే అందిచ్చిన సిగరెట్లను కాలుస్తూ అప్పుడే ప్రారంభమైన వినోద కాలక్షేపంలో నిమగ్నులైన విలేఖర్లు కరువునే కాదు ఈ లోకాన్నే మరచి పోయారు.

మత్స్యశాఖామాత్యులు శ్రీ రాజా సుందరప్రకాశ గోవర్ధన శతపథిగారు మరునాటి కార్యక్రమాన్ని గురించి కలెక్టరుతో ముచ్చటిస్తూ సోఫాలో పడుకొన్నారు.

చేపల మంత్రి పర్యటనలో తొలిరోజు కరువు నివారణ కార్యక్రమం నిర్విఘ్నంగా జయప్రదంగా జరిగిపోయింది. ముక్కంటి సీమ సామ్యవాద ప్రభుత్వ జైత్ర రథం ప్రగతి పథంలో ఒక కిలోమీటర్ ముందుకు సాగింది. ●